# 5 విధివిలాసము

కాలేజి కాంపౌండు దాటి రోడ్డుపైకి వచ్చాడు చంద్రమౌళి. ఏవైపు వెళ్ళడమా అని కాసేపు తటపటాయించాడు. పట్టణంలో ఏ మూలకు వెళ్ళినా ప్రొద్దుపోతుంది. ఆమాట కొస్తే ప్రొద్దు పోవడమెలాగన్నది చంద్రమౌళి కొక సమస్య కానేకాదు. పుస్తకం చేతబట్టుకుని ఏకాంతంగా ఏ చెట్టుక్రింద కూర్చున్నా చంద్రమౌళికి గంటలకు గంటలే దొర్లిపోతాయి. అలాగని అతడు వంచినతల పైకెత్తకుండా పుస్తకాన్ని ఆసాంతం చదివేస్తాడని గాదు. అలా చదవకపోవడం అటుండగా వాక్యానికి, వాక్యానికీ బ్రేకు పడుతుంది. ప్రతివాక్యమూ అతని భావజలధిలో కవ్వంలా గిరగిర తిరిగిపోతుంది. ఊహలకు పైన ఊహలు అల్లుకపోతాయి. ఇంతగా ఆలోచించ గలిగిన చంద్రమౌళికి కొన్నికొన్ని చిన్న విషయాలను గురించి ఆలోచించడం బొత్తిగా చేతగాదు. ఏవైపుగా వెళ్ళాలి? ఎప్పుడు భోజనం చేయాలి? ఎప్పుడెప్పుడు ఎలాటి వుడుపులు తొడుక్కోవాలి? ఏవేళప్పుడు పడుకోవాలి?— ఊఁహూ, తల చించుకున్నా వీటికి సమాధానం స్ఫురించదు చంద్రమౌళికి. అతడు తోడి లెక్చెరరును సిన్సియర్‌గా అడిగి చూచాడు గూడా—"దీనికేమైనా రెమెడీ చెప్పగలవా?" అని. అడిగి యింకా అరగంట గడవలేదు. అందు కామిత్రుడు ఓ చిత్రమైన సమాధానం చెప్పాడు—

"డియర్ చంద్రమౌళీ! భావాంబరంనుంచి క్రిందికి దిగలాగి ఒక్కింతసేపైనా నిన్ను నేలపైన నడిపించడానికి నాకొక్క వుపాయం మాత్రమే స్ఫురిస్తోంది. అనురాగాలాపాలతో మత్తెక్కించడానికి గాకపోయినా చెవిలో యిల్లుగట్టుకుని పోరడానికైనా నువ్వొక అమ్మాయి మెడలో మూడు ముళ్ళువేయాలి. ఆ అమ్మాయి వివేకం గలిగిన చిన్నదైతే నీకొక టైమ్‌టేబిల్ ఏర్పరుస్తుంది. నియమాతిక్రమణ జరిగితే చెవులు

నులిమి నిన్ను నీ ఊహా ప్రపంచంలో నుంచీ వాస్తవ జగత్తులోకి లాక్కు-పోతుంది. కానీ వచ్చిన చిక్కే-మిటంటే నీ అంతకు నువ్వుగా ప్రేమ పురాణాన్ని సాంగోపాంగంగా నడిపించి ఫలశ్రుతిలాంటి పరిణయ ఘట్టాన్ని చేరుకోలేవు. పోనీ, ఓ అమ్మాయి స్వప్రయత్నంతో నీ సరసకు రావడానికి ప్రయత్నిస్తే ఆమెను అర్థం చేసుకోనూలేవు. ఈ పరిస్థితిలో ఏం చేయాలో నాకూ తోచకుండా వుంది. పత్రికల్లో ఓ ప్రకటన వేయించినా బాగుండి పోవును!—'అభినవ ఋష్యశృంగుణ్ణి వలచి వలపించుకోడానికి ఓ అపర శాంతాదేవి కావాలి'—అని!''

ఈ జవాబును తలచుకున్నకొద్దీ చంద్రమౌళి పెదవిపైని చిరునవ్వు చిన్నచిన్నగా చెంపలపైకి ప్రాకడానికి ప్రయత్నిస్తోంది-భావజగత్తువేరు. బాహ్య జగత్తు వేరు. భార్య అన్న వ్యక్తి యీ రెండింటికీ లంకె కాబోలు! ఆమె ముద్దరాలైతే లోకాన్ని మరిపించనూ గలదు. మూర్ఖురాలైతే నరకాన్ని చూపించనూగలదు. కొంపదీసి తనకు రాబోతున్న భార్య ఈ రెండో తెగకు చేరిన మనిషైతే?-చంద్రమౌళి పెదవిపైన చిరునవ్వు చెదరిపోయింది. సోక్రటీసు పెళ్ళాంలాంటిదొకతె వచ్చి మెడకు చుట్టుకుంటే తన గతేం కావాలి?

చంద్రమౌళి రోడ్డువెంట నడుస్తున్నాడు అతడి కళ్ళ ఎదుట కార్లు దూసుకపోతున్నాయి. రిక్షాలు పరుగిడుతున్నాయి. మనుషులు కదిలి పోతున్నారు. ఈ దృశ్యాలన్నీ అతడికంటికి కనిపిస్తున్నాయిగానీ మెదడుకు మాత్రం అందడంలేదు. ఇంద్రియానుభవాలను మెదడుకు చేరవేసే నరాలు ఏ కారణంచేతనైనా తమ పనిని తాము చేయడం మానుకున్నప్పుడు ఓ దృశ్యం కంటికి కనిపించినా కనిపించనట్లే! ఓ శబ్దం చెవికి వినిపించినా వినిపించనట్టే! యీ స్థితికే మరోపేరు-పరధ్యానం!

చదవడం మంచిదే! ఆలోచించడమూ మంచిదే! కానీ ఆ చదవడానికీ యీ ఆలోచించడానికీ ఓ పరిమితి అవసరం. మితిమీరి మ్రోగిస్తే మద్దెల పగిలిపోతుంది. బలాన్నంతా ప్రదర్శిస్తే తంత్రులు తెగిపోతాయి. చంద్రమౌళి విషయంలోనూ అంతే జరిగింది. విపరీతమైన శ్రమవల్ల బుర్ర

పాదై అతడు మూడేళ్ళపాటు మన మనిషి గాకుండా పోయాడు. ఒక సంవత్సరం కీల్పాకులోనూ, రెండేళ్ళు విశాఖపట్టణంలోనూ గడిపి మళ్ళీ మనిషిగా మారి యీ లోకంలోపడ్డాడు.

ఇది గూడా రెండేళ్ళ క్రిందటి సంగతి.

అప్పటినుంచీ చంద్రమౌళికి భయంగానే వుంది-తనేమో ఒంటరివాడు. యీ లోకంలో తనపట్ల శ్రద్ధవహించే వాళ్ళెవరూ లేరు. తల్లి తన చిన్నతనంలోనే గతించింది. అష్టకష్టాలుపడి చదివించిన తండ్రి ఫలితాన్ని కళ్ళజూడకమునుపే కళ్లు మూసుకున్నాడు. ఆనర్స్ పరీక్షవ్రాసి స్వగ్రామానికి వెళ్ళిన కొత్తలో తనకు పిచ్చిపట్టింది. ఖాతాలో పూర్వజన్మ సుకృతం కాస్తా జమగా వుండబట్టి మళ్ళీ స్వస్థత చేకూరింది. నాటినుంచీ తను ఆరోగ్యం పట్ల కొంత శ్రద్ధ తీసుకుంటున్నమాట వాస్తవమే! మునుపటిలా విపరీతంగా చదవడంలేదు. ఆలోచనలు యథాప్రకారంగా చెలరేగుతున్నా అప్పటికప్పుడే వాటిని కట్టి పెట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. రాత్రుల్లో బాగా నిద్ర పట్టడానికి ఏవో కొన్ని వైద్యప్రక్రియలకు గూడా లోనౌతున్నాడు. కానీ ఎంత చేసినా యీ పడవకో చుక్కాని మాత్రం అత్యవసరం. లేకుంటే ఏ క్షణాన ఏ కష్టం వాటిల్లగలదో వూహించడం కష్టం.

"ఇదిగో! బా....బాబూ! మిమ్మల్నే! పాతచావడి వీధికి ఎలా వెళ్ళాలో చెబుతారటండీ?"

"పాతచావడి వీధికా!" తల గోక్కుంటూ ఆ పల్లెటూరి పెద్దమనిషి వైపు చూచాడు చంద్రమౌళి. చూస్తూ చూస్తూ దగ్గిరికి వెళ్ళాడు. వెళ్ళి "మిమ్మల్ని ఎక్కడో చూచినట్టు జ్ఞాపకం" అన్నాడు.

సరిగ్గా ఆ పల్లెటూరి పెద్దమనిషి గూడా చంద్రమౌళివైపు అలాగే చూస్తూ "నాకూ మిమ్మల్ని ఎక్కడో చూచినట్టే జ్ఞాపకం" అన్నాడు.

"అలాగా! ఆశ్చర్యంగానే వుంది. పోనీ, వూరూ, పేరూ చెప్పండి. చూద్దాం" అన్నాడు చంద్రమౌళి.

"ఊరు క్రొత్తకోట. పేరు వెంకట నరసయ్య."

"క్రొత్తకోట మునసబు గారన్న మాట!"

"అవును. నన్ను మీ రెరుగుదురేమిటి?" విస్మయంలో తలమునకలై పోతున్నాడు పల్లెటూరి పెద్దమనిషి.

"నేను మిమ్మల్ని ఎరుగడమేగాదు, మీరుకూడా నన్నెరుగుదురు. నేను మిమ్మల్ని ఎన్నడో కలుసుకోవలసింది. కలుసుకుని నా కృతజ్ఞతను తెలుపుకోవలసింది. కానీ ఆలస్యం జరిగిపోయింది. అందుకు మీరు నన్ను మన్నించాలి. మన్నించి యీ పూట నా ఆతిథ్యాన్ని స్వీకరించాలి...."

"నన్నా! మీ ఆతిథ్యాన్ని స్వీకరించమంటారా?" వెంకటనరసయ్య గారికి మతిపోయినంత పనౌతోంది.

"ఇక్కడ రోడ్డుపైన నిల్చుని మాట్లాడుకోడ మెందుకు? వెళ్దాం రండి. తీరిగ్గా మాట్లాడుకోవచ్చు."

బసకు వెళ్ళగానే చంద్రమౌళి స్వయంగా చేదబావిలోనుంచీ నీళ్ళు చేది వెంకటనరసయ్యగారిని కాళ్ళూ చేతులూ కడుక్కోమన్నాడు. పొరుగింటి కుర్రాణ్ణి హోటలుకు పంపించి టిఫిన్ తెప్పించాడు. అతిధి ఉపాహారం తీసుకుంటూ వుండగా బయటికివెళ్ళి వీధి మొగదలలోవున్న బంకులోనుంచీ తాంబూలం తీసుకొచ్చాడు.

ఈ అయాచిత సత్కారం తాకిడికి తట్టుకోలేక పోతున్నారు వెంకట నరసయ్యగారు. చంద్రమౌళి గూడా ఆయనను మరెంతోసేపు యిలా సందేహడోలలో కూచోబెట్టి వుయ్యాలలూపడం భావ్యంకాదనుకున్నాడు.

"నే నెవరినో మీ కింకా గుర్తుకు రాలేదు గదండీ!" అన్నాడు.

"అబ్బే, లేదండీ!" కించపడుతూ అన్నారు వెంకటనరసయ్యగారు.

"ఐతే నేనే చెబుతాను: మీ వూరికి దాపున రైలుదారి పరుగెడుతుంది కదూ?"

ఈసారి వెంకట నరసయ్యగారు బిక్కమొగమేసేశారు. చంద్రమౌళివైపు దిగాలు పడి చూస్తూ "పరుగిడుతుంది. ఐతేనేం?" అన్నారు.

"అయిదేళ్ళకు మునుపు ఆ రైలు దారిపైన ఓ సంఘటన జరిగింది...."

"నిజమే! దారి కడ్డంగా రాళ్లు పెట్టడం, రైలు నిలచిపోవడం, ఎంక్వయిరీ జరగడం...."

"ఆ పని చేసింది అప్పట్లో మీ ప్రాంతంలో తిరుగు తుండిన ఓ పిచ్చివాడు...."

వెంకట నరసయ్యగారి ముఖాన గుప్పు గుప్పున చెమట పట్టి పోతోంది. ఆయన కనుగ్రుడ్లు కోడి గ్రుడ్లకుమల్లే పైకి పెల్లుబుకి పోతున్నాయి.

"ఆ పిచ్చివాణ్ణి నేనే!"

"ఏమిటీ!" భయం అదొక విద్యుల్లతలా వెంకట నరసయ్యగారి రక్తంలో సుళ్లు తిరిగిందేమో! ఆ తొట్రుబాటులో ఆయనొక గావుకేక పెట్టి బయటికి పారిపోతారేమోననిపించింది చంద్రమౌళికి!

"భయపడకండి! నే నిప్పుడు పిచ్చివాణ్ణిగాను. మీ దయవల్ల ఆ రుగ్మత నుంచీ బయటపడగలిగాను."

"నా దయవల్ల?! నే నేం చేశానని?"

"పోలీసులు ఎంక్వయిరీకి వచ్చారు. ఆ పని చేసిందెవరో మీ మూలంగా వాళ్ళకు తెలిసింది. కానీ ఎంత ప్రయత్నించినా వాళ్ళచేతికి నేను దొరికానుగాను. చివరకు మీ తోడ్పాటువల్లనే వాళ్లు నన్ను పట్టుకోగలిగారు...."

"కానీ అది వుపకార మెలాగౌతుంది?"

"విధివిధానంలోని విచిత్రమదే మరి! ఒక్కొక్కప్పుడు అపకారమే వుపకారమౌతుంది. పిచ్చివాణ్ణి దండించడానికి శిక్షాస్మృతి ఒప్పుకోదు. అలాగని వదిలిపెడితే నేను మళ్ళీ అలాటి దుండగాలకు పూనుకోవచ్చు. అంచేత ప్రభుత్వమే తన స్వంత ఖర్చుతో నాకు చికిత్స చేయించవలసి వచ్చింది."

విషయం తేటతెల్లమైనా వెంకటనరసయ్యగారు విస్మయావస్థలో నుంచి మాత్రం తేరుకోలేకపోయారు. బయట చీకటిపడింది. వీధుల్లో ఎలక్ట్రిక్ దీపాలు వెలిగాయి. కాలం గడచిపోతోంది. కానీ వెంకటనరసయ్యగారు మాత్రం ఆశ్చర్యాంబుధిలో మునగానాం తేలానాం అన్నట్టుగా కదలకుండా మెదలకుండా కుర్చీలో ఐక్యమై వుండిపోయారు.

ఎనిమిది గంటలకల్లా హోటలునుంచీ కారియర్ వచ్చింది.

భోజనమైన తర్వాత చంద్రమౌళి అతిధిని డాబాపైకి తీసుకెళ్ళాడు. పుచ్చపువ్వులాంటి వెన్నెల. చేరువలోవున్న పార్కుపైనుంచీ కమ్మగా మందమారుతం వీస్తోంది. దూదిపింజలలాంటి మబ్బులకేసి చూస్తూ పిట్ట గోడకు చేరగిలబడి కూర్చున్నారు వెంకటనరసయ్యగారు.

"అన్యధా భావించకపోతే మిమ్మల్ని ఓ విషయం అడగాలని వుందండీ!" అంటూ ఉపక్రమించాడు చంద్రమౌళి.

వెంకటనరసయ్యగారు వులిక్కిపడ్డారు. చంద్రమౌళి ముఖంలో దేని కోసమో గాలించి, అలాటిదేమీ కనిపించకపోవడంతో మళ్ళీ మామూలు స్థితికివచ్చి "అడుగు నాయనా! సందేహమెందుకు?" అన్నారు.

"వచ్చినప్పటినుంచీ మిమ్మల్ని చూస్తున్నాను. మీరు దేన్ని గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నారు. ఏదో చింత విడుపు లేకుండా మీ మనసులో రాజుకుంటూ వున్నట్టుంది...."

వెంకటనరసయ్యగారు వేడిగా నిట్టూర్చారు.

"నా బాధ ఒకరు ఆర్చేదీ, తీర్చేదీ గాదు బాబూ! ఐనా ఎందుచేతనో నా సోదంతా నీదగ్గర వెళ్ళబోసుకోవా లనిపిస్తోంది. నాకు పొలాలున్నాయి. డబ్బుంది. ఇళ్ళున్నాయి. అంతా నా స్వార్జితమే! మాట కెదురులేకుండా గ్రామాన్ని చెప్పుచేతల్లో వుంచుకుని పరువుగా బ్రతికాను. కాని ఏం లాభం? భగవంతుడు నిశ్చింతగా చనిపొమ్మని నా నుదుట వ్రాసిపెట్టలేదు. ఒకటి రెండు చింతలు నన్నహరహమూ వేపుక తింటున్నాయి...."

"చెప్పండి...." సావధానతను ప్రకటిస్తూ జరిగి కూర్చున్నాడు చంద్రమౌళి.

"ఒక్కడే కొడుకు నాకు! వాడు నన్నూ వంశాన్నీ వుద్ధరిస్తాడను కున్నాను. ఆశలన్నీ వాడిపైన్నే వుంచుకున్నాను. కానీ వాడు తులసివనంలో గంజాయి మొక్కై కూచున్నాడు, వాడికి చదువు పట్టుబడలేదు. నిలకడగా యింటిపట్టున పడివుండలేకపోయాడు. ఊళ్ళో వున్నంతకాలం ఎక్క డెక్కడి రగడ లన్నింటినీ యింటి పైకే తెచ్చేవాడు. ఆఖరుకు మూడేళ్ళ ప్పుడు చేతికి దొరికిన డబ్బుతో సహా వూరూ, నాడూ విడిచి పరారై పోయాడు...."

"వెదికించలేక పోయారా?"

"ఒక్క వెదికించడమేగాదు. పత్రికల్లో ప్రకటనగూడా వేయించాను. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా వాడి ఆచూకీ తెలిసిందిగాదు. వాడి కథ అలా తెల్లవారిందా. యిక రెండోది - అమ్మాయిని గురించిన చింత! ఆమె మనుషుల్లో పుట్టవలసింది గాదు. తప్పిదారీ పుట్టిందనే నా వూహ. లేకపోతే యీ యీడుకే ఆమె కంతటి ఓపిక, అంతటి వివేకమూ ఎలా వస్తాయి చెప్పు! ఈపాటికే ఆమెకి పెళ్ళి కావలిసింది. సంబంధాలేమో వస్తున్నాయి. కానీ అదేం గ్రహచారమో గానీ ప్రతి సంబంధంలోనూ ఏదో ఒక అవలక్షణం పొడసూపుతోంది. ఓ కుర్రాణ్ణి చూచాను. చదువుకున్నాడు. కాస్తో, కూస్తో వున్నవాడు. అందగాడు గూడా. కానీ యిన్నింటికీపైన అతడు పేకాటరాయుడని తెలిసింది. మరో కుర్రాడు పెళ్ళి చూపులకంటూ వచ్చి కూర్చున్న పదిహేను నిమిషాల్లో రెండు ప్యాకీల సిగరెట్లు కాల్చి పారేశాడు. మరొకడు గళ్ళబనీనుపైన గ్లాస్కో జుబ్బా తొడుక్కుని ఫైల్మాన్‌లా వూడిపడ్డాడు. అతగాడి కెందుకో అడుగడుగునా చిరాకు, మాటకుముందే కోపం...."

"మీరింత తీవ్రంగా పరీక్షించడానికి పూనుకుంటే మీ పరీక్షకు తట్టుకోగల అల్లుడు దొరకడం దుస్తరమేమోనండీ!" చిరునవ్వుతో తన సందేహాన్ని బయట పెట్టాడు చంద్రమౌళి.

"ఏం చేయమంటావు బాబూ! మమకారం చెడ్డది. ఆ అమ్మాయిని నేనెంత గారాబంగా పెంచాను. ఆమె పైన యీగ వ్రాలితే నా గుండె లవిసిపోతాయి. ఆమెను ప్రాణప్రదంగా చూచుకోగల అల్లుడు కావాలి నాకు! అలాటివాడు దొరకనే దొరకడంటావా?"

చంద్రమౌళి గూడా ఆలోచనలో పడ్డాడు. రాత్రంతా ఆలోచించాడు. తెల్లవారబోతుండగా ఓ నిర్ణయానికి వచ్చాడు. ఆ నిర్ణయానికి తగ్గట్టుగా వెంకటనరసయ్యగారు చంద్రమౌళిని తమ గ్రామానికి ఆహ్వానించారు. ఆ ప్రయాణం యీ పడుచువాడికీ ఆ ముసలివాడికి మధ్య మరింత సాన్నిహిత్యం ఏర్పడడానికి వుపకరించింది. చంద్రమౌళి అమ్మాయిని చూచాడు. వల్ల

మాలిన సిగ్గుతో మరీ అంత భీతహరిణంగాకుండా నిశ్చలమైన నీలికళ్ళతో ఆ అమ్మాయి చంద్రమౌళి వైపోసారి నిదానించి చూచింది. చంద్రమౌళి ఆదరాబాదరా తన రొమ్మును తడవి చూచుకున్నాడు. అనుకున్నంతా అయింది, అక్కడ తన హృదయం లేదు!

"అమ్మో, హృదయాన్ని దోచుకోడమంటే యిదేనేమో!" అనుకున్నాడు చంద్రమౌళి.

పోగా యిదంతా వన్ సైడ్ ట్రాఫిక్కుగా మాత్రం పరిణమించలేదు. అటువైపున వెంకటనరసయ్యగారికి గూడా చంద్రమౌళిలో తన అల్లుడికి కావలిసిన శుభలక్షణాలు ఒక్కొక్కటిగా కనపడుతున్నాయి.

* * *

మనం ఇలా జరగాలనిగానీ, లేక యిలా జరుగుతుందనిగానీ, అనుకున్న సంఘటన అలా జరుగకపోవడం దగ్గరనుంచే అసలుకథ ఆరంభమౌతుంది. కథకు సంబంధించిన యీ సిద్ధాంతందృష్ట్యా ఆలోచిస్తే యిది కథేకాదేమో ననుకోడానికి గూడా వీలుంది! ఎందుకంటే అందరూ అనుకున్నట్టుగా చిరంజీవి చంద్రమౌళికీ, సౌభాగ్యవతి శ్రీ లక్ష్మికి పెళ్ళి నిర్విఘ్నంగా జరిపోయింది. పోగా వధూవరులు కాస్తా తొందరపడి ఒకరిపట్ల ఒకరు పెళ్ళికి ముందరగానే పెద్దగా అంచనాలు వేసుకోడం, ఆ అంచనాలు ఒక్కొక్కప్పుడు స్వల్పంగానూ, మరొక్కప్పుడు అధికంగానూ తారుమారై పోయి ఆశాభంగాలు కలగడం అక్కడక్కడా మామూలే! కానీ యిక్కడ యీ నవదంపతుల విషయంలో అలాటిదేమీ జరగలేదు. పైగా అనతికాలంలోనే వాళ్ళొకరి నొకరు క్షణమైనా విడిచిపెట్టి వుండలేని 'పరిణతి'లోకి వచ్చేశారు.

ఆశ్చర్యకరమైన విషయ మేమిటంటే యీ పరిణామం వెంకటనరసయ్యగారిని అదొక హృదయశల్యంలా బాధించింది. అసలు పుత్రికాజీవులైన తల్లిదండ్రులతో వచ్చిన చిక్కే యిది! ఈడూ జోడూ కుదిరి కూతురి ముద్దూ ముచ్చటా తీర్చగల వరుడు పీటలపైకి వచ్చేవరకూ వాళ్ళ కదొక బెంగ! ఆ తరువాత అమ్మాయి మొగుణ్ణి కొంగుకు కట్టేసుకుని తన

కాపురాన్ని చక్కబెట్టుకోడంలో నిమగ్నమైతే కూతురికీ తమకూ ఎడబాటై పోయిందిగదా అని అదొక చింత!

అప్పటికీ వెంకటనరసయ్యగారు వారాని కొకసారి స్వగ్రామంనుంచి పట్టణానికి వచ్చేవారు. వచ్చి ఒకటి రెండురోజు లుండగానే అక్కడ సంసార మేమైపోయిందో నన్న ఆదుర్దాతో హడావిడిగా బయల్దేరేసేవారు. మనిషొకచోట వుంటే మనసొకచోట వుండిపోయేది. ఈ వేరుబాటువల్ల కలిగిన ఆందోళన ఆరోగ్యానికి అఘాతంలా సోకి ఆయన ఎండవడ తగిలిన నల్లికళ్ళ పాములా నానాటికీ పలచపడి పోసాగారు.

"ఈ వృద్ధాప్యంలో లేనిపోని అలతలతో సతమతం గావడం మంచిదిగాదు. కృష్ణారామా అనుకుంటూ మీ రిక్కడే వుండండి. అంతగా అవసరమైతే నెలకొకటి రెండుసార్లు గ్రామానికి వెళ్ళొస్తాను" అని అల్లుడు మామగారికి చెప్పి చూచాడు 'గూడా! కానీ శరీరంలో లేచి నడిచేపాటి ఓపిక వున్నంతవరకూ ఆ మామగారు యీ అల్లుడి హితవును పాటించలేక పోయారు.

తీరా జవసత్వా లుడిగి, రోగశయ్యపైకి ఒరిగిపోయిన తర్వాత వెంకట నరసయ్యగారి తలపులన్నీ తనకు గాకుండా పోయిన కుమారుడి పైకి ప్రసరించాయి. తమ ప్రాణం గుటుక్కుమనే లోపల ఏదో అజ్ఞాత శక్తి అతణ్ణి తీసుకొచ్చి తమ ఎదుట నిలుపుతుందని గూడా ఆయన ఆశిం చారు. ఆ ఆశగూడా అడియాసే అయింది. తెల్లవారు జామున అంతిమశ్వాస వదలిపెట్టబోతున్నారనగా క్రితంరోజు సాయంత్రం ఆయన అల్లుణ్ణీ కూతుర్నీ దగ్గరికి పిలిచి చెరొకవైపున కూర్చోబెట్టుకున్నారు. చంద్రమౌళి వైపు చూస్తూ, జీవితంలో మొట్టమొదటిసారిగా అతడితో మాట్లాడుతున్నట్టు "నా కొక కొడుకున్నాడు బాబూ! వాడికోసం వేచి చూచీ చూచి నా కళ్ళు కాయలుగాసిపోయాయి. వాడున్నాడో వూడాడో తెలియదు. నా గ్రుక్కలోకి నీళ్లుపోయనివాడు వాడున్నా ఒకటే, వూడిన ఒకటే! నా కల్లుడివైనా, కుమారుడివైనా నువ్వే! అమ్మాయికంట్లో కన్నీ రొలకకుండా చూచుకునే భారం నీది!" అంటూ జొట జొట కన్నీరు కార్చారు.

వెంకటనరసయ్యగారు చనిపోయిన తర్వాత రెండు మూడు మాసా లకు. ఓరోజు రాత్రి మళ్ళీ డాబాపైన పుచ్చపువ్వులాంటి వెన్నెల కాస్తోంది. చాపపైన ప్రక్కవాటంగా పడుకుని శ్రీలక్ష్మి చందమామలోని కుందేలు వైపు చూస్తోంది. చంద్రమౌళి పిట్టగోడ కానుకుని పట్టణ దృశ్యాలను పరికిస్తున్నాడు.

ఉండి వుండీ శ్రీలక్ష్మి ప్రారంభించింది—

"ఏమండీ! ఒకమాటడుగుతాను...."

"అడుగు. సందేహ మెందుకు?"

"భార్యా భర్తల మధ్య రహస్యా లుండగూడదంటారు...."

"నిజమే మరి! ఎందుకుండాలి లక్ష్మీ? రహస్యాలున్నంతవరకూ ఆ దాంపత్యంలో ఏదో లోపముందన్న మాట!"

"అంతమాటనకండీ! నాన్నగారు పోయినప్పటినుంచీ చెప్పాలనుకుంటున్నాను. అనుకోవడం, మళ్ళీ మీ రేమనుకుంటారోనని తటపటాయించడం, పెదవిదాకా వచ్చిన మాటను అలాగే త్రుంచివేయడం - యిలాగే గడచి పోయాయి రోజులు...."

"పోనీ యిప్పుడైనా చెప్పు లక్ష్మీ! అదెలాటి రహస్యమైనా నే నేమీ అనుకోను," అంటూ చంద్రమౌళి చాపపైన కూర్చున్నాడు.

"మరి....మరి, ఆ నాడు...."

"ఏనాడు?"

"ఐదారేళ్ళకు మునుపు దారి కడ్డంగా రాళ్ళున్నందువల్ల మా వూరి దగ్గర రైలాగిపోయిందిగదూ?"

"అవును, యిప్పుడా ప్రసక్తి ఎందుకూ?"

"అక్కడలా రాళ్ళుంచింది మీరే ననుకుంటున్నారు. నిజానికది మీరు చేసిన పనిగాదు...."

"నేనుగాదూ? కాదని నువ్వెలా చెప్పగలవు లక్ష్మీ?"

"నాకే కాదు, మరికొంతమందికి గూడా నిజం తెలుసు. ఐతే నాన్న గారంటే వున్న భయంవల్ల నిజం బయటికి పొక్కిందిగాదు. ఆ పోలీసు లైనా కాస్త ఆలోచించి వుండవలసింది. పిచ్చివాడు ఎంతటిపనైనా చేయ గలడనుకున్నారే గానీ, యిద్దరు ముగ్గురు చేతులు గలిపితేగానీ ఆ రాళ్ళు కదలి వుండవన్న విషయం వాళ్ళకు తోచిందిగాదు. అసలు నాన్నగారు వాళ్ళు రాకముందే ఈ నేరాన్ని ఎవరిపైకి త్రోసివేయడమా అని ఆలోచిం చారు. ఆయన కళ్ళకు దిక్కూ మొక్కూ లేకుండా తిరుగుతూ సమయానికి మీ రొకరు కనిపించారు—"

చంద్రమౌళి తెల్లబోయాడు. ఆశ్చర్యంగా భార్యకేసి చూస్తూ "మీ నాన్నగారికి నాపైన అకారణ వైరమా లక్ష్మీ?!" అన్నాడు.

"కాదు. నేరస్థుల్ని కాపాడాలన్న తాపత్రయం."

"ఇంతకూ నేరస్థు లెవరో చెప్పావుగావు."

"ఎవరైతేనేమి! వాళ్ళకు నాయకుడు మా అన్నయ్య. అదేం చిత్రమోగానీ దారిలో గోతులు తీయడం, రైలు కడ్డంగా రాళ్ళుంచడం, పచ్చటి చెట్లను మొదలంటా నరికివేయడం - యిలాటి వన్నీ వాడికి వినోదాలు!"

చంద్రమౌళి అయిదు నిమిషాలసేపు మౌనంగా స్తబ్ధుడై వుండి పోయాడు. ఆ తరువాత కాస్త కోలుకుని "కన్నకొడుకుపైన తండ్రి కంతటి మమకారం వుండడంలో విడ్డూర మేమీ లేదు లక్ష్మీ! కానీ అలాటి కొడుకు తండ్రి కెందుకూ వుపకరించక పోవడం, చివరకు ఎవరిపైన నేరం మోప బడిందో, ఆ నేరస్తుడే ఆయన గుక్కలో నీళ్ళు పోయవలసిరావడం-యిదే విధి లీలలోని విడ్డూరం-కాకపోతే వినోదం" అన్నాడు, మెల్లగా చాపపైకి వ్రాలిపోతూ.